# నిర్భాగ్యులు - - - -

[కథానిక]

= శ్రీ సీతారాం =

సిమ్హాద్రి చిన్నప్పట్నుంచీ ఒక వర్కుషాపులో పనిచేస్తూవుండేవాడు. రోజుకి రెండణాల కూలి దగ్గిర్నుంచీ రూపాయికూలీదాకా వచ్చాడు. ఒక బీడీ, టీ తప్ప వేరే దుర్గుణాలేమీ లేవు. ఎంత డబ్బువస్తే అంతా, తన చేతిఖర్చుకి కొంచెం వుంచుకుని, తీసుకెళ్లి తండ్రి కిచ్చేసేవాడు. తండ్రే యింటిపెత్తనం అంతా చూచేవాడు. తండ్రికి దగ్గరదగ్గర యాభైఏళ్లుంటాయి. ఒక మిల్లులో వాచ్‌మన్‌పని అతనికి. పోలీసుపని చేసి మానేశాడు. ఓ పదిరూపాయలు పెన్షను వచ్చేది. ఆ పదిరూపాయలు, మిల్లులో తన జీతం పదిహేనురూపాయలు, సిమ్హాద్రిజీతమూ—అదే వారి మొత్తం ఆదాయం. ఇంట్లో నలుగురున్నారు: సిమ్హాద్రి, అతని తల్లీ, తండ్రీ, అప్పలమ్మ. అప్పలమ్మ సిమ్హాద్రి మేనమామకూతురు. ఆపిల్ల తల్లీ, తండ్రీ చిన్నప్పుడే చచ్చిపోయారు. అప్పట్నుంచీ ఆపిల్లని సిమ్హాద్రితల్లే సాకుతూవుంది. వాళ్లకొచ్చే డబ్బు బాగా సరిపోవాల్సిందే. కాని సిమ్హాద్రితండ్రికో చిన్న దురలవాటు వుంది—తాగుడు. దాంతో ఏమొచ్చినా చాలేదికాదు. సిమ్హాద్రి ఇప్పటికాలపు మనిషి కాకపోవడంమూలాన తండ్రిని ఎదిరించేవాడు కాడు. తల్లితో మెల్లిగా చెప్తూవుండేవాడు: వచ్చేనెలనుంచీ తన జీతం యింట్లో యివ్వననీ, ఏమేమి కావలసినా తనే తెస్తాననీ. కాని ఎప్పటికప్పుడు యిలా అంటూవుండడం, జీతం తెచ్చి తండ్రి కిచ్చేస్తూవుండడం జరుగుతూ వుండేది. తండ్రంటే అదేమిటో విపరీతమైన భయంగా వుండేది సిమ్హాద్రికి తనకి పాతికేళ్లొచ్చినా.

సిమ్హాద్రిపెళ్లి పంధొమ్మిదో ఏట జరిగింది. అప్పటికి అప్పలమ్మకి ఏడోఏడు. ఇద్దరికీ మధ్య దాదాపు పన్నెండేళ్లు వారా. సిమ్హాద్రి కింకా చిన్నప్పుడే పెళ్లికావలసిందికాని సిమ్హాద్రితల్లి తన మేనకోడల్ని చేసుకోవాలని ఆపిల్లకి ఏడోఏడు వచ్చేవరకూ పెళ్లి ఆపింది. మొత్తంమీద తన కోర్కె నెరవేర్చుకుంది. చిన్నప్పట్నుంచీ అప్పలమ్మా, సిమ్హాద్రీ ఒకేచోట వుండబట్టిగాబోలు ఎప్పుడూ గిల్లికజ్జా లాడుకునేవారు.

కాని అప్పలమ్మకు వయస్సు వస్తున్నకొద్దీ బావను చూస్తే చాటుచాటుకి వెళ్తూవుండేది. సిమ్హాద్రి కూడా చనువుగా అప్పలమ్మను పిలిచేవాడు కాడు. తనను చూచి చాటుకి వెడుతూవుంటే కనుకొలకుల్లోంచి ఆమెయవ్వనాన్ని చూచి మురిసేవాడు.

అప్పలమ్మ పెద్దమనిషి అయింది. దసరాదశమికి ఇద్దర్నీ సంధానం చేయడానికి నిశ్చయించుకున్నారు.

విజయదశమి వచ్చింది. ఆరోజు వూరంతా సందడిగా వుంది. ఏఇంటికి చూచినా పచ్చతోరణాలే. పిల్లలు విల్లంబులు పుచ్చుకుని బడిపంతుళ్ల వెనకాల "జయాభిజయభవా దిగ్విజయభవా" అని కేకలేసుకుంటూ పప్పుబెల్లాలకు యింటింటికీ తిరుగుతున్నారు. కొందరు పెద్దపులివేషాలు వేసుకుని డప్పులు ముందు రణగొణధ్వని చేస్తూవుంటే వెనకాల తందనాలు త్రొక్కుతున్నారు. జనం-ముఖ్యంగా పిల్లలు-మూకలు మూకలుగా వేషాల వెంట తిరుగుతున్నారు. ఎక్కడ చూచినా కోలాహలమే.

ఆరోజు సిమ్హాద్రికి మహా వుషారుగా వుంది. షావుకారుగారు వర్కుషాపు పనివాళ్లందర్నీ ఆ రోజు వుదయమే వచ్చి మరలన్నిటికీ పసుపూకుంకాలు పెట్టి పూజచేసి కాసేపు వర్కుషాపు వదిలి తర్వాత కట్టేసి వెళ్లిపోవచ్చు నన్నారు. అంతా కొత్తగుడ్డలు కట్టుకుని ముఖానికి కుంకంబొట్లు పెట్టుకుని వర్కుషాపులో వుదయానే చేరారు.

పసుపుకుంకాలు పెట్టారు మరలకి. కొబ్బరికాయ కొట్టారు. అటుకులూ, బెల్లం కలిపి అందరికీ పంచిపెట్టారు. వర్కుషాపు వదిలారు.

సిమ్మాద్రి వుషారుగా యంత్రాలమధ్యనుంచి అతి తొందరగా పళ్లచక్రాలకు తన గుడ్డలు తగలకుండా చాకచక్యంగా తప్పించుకుంటూ తను పనిచేసే యంత్రం దగ్గిరికి వచ్చాడు. తనకు కావలసిన పనిముట్టు ఒకసారి సాంకట్టి యంత్రానికి బిగించాడు. చక్రం మెల్లిగా తిరుగుతోంది. తనకు సాయం చేసే కుర్రాడు ఆరోజు పండగని అసలు పనిలోకి రాకుండానే ఎగ్గొట్టేశాడు. చక్రం సరిగ్గా తిరగకుండా వుంటే చికాకువేసి తనే షాఫ్టుమీద కెక్కి ఒకసారి నూనె వేశాడు బాల్ బేరింగులో. బాల్ బేరింగు అరిగిపోయింది. షాఫ్టు సరిగ్గా తిరగక బెల్టు పుల్లీమీదనుంచి మాటిమాటికీ టపటపమని జారిపోతోంది. అతనికి చికాకు వేసింది. వర్కుషాపు కట్టించి ఆ పని చూద్దామంటే అసలారోజు ఎంతోసేపు పనిచెయ్యక్కరలేదాయె. ఇది ఆపి మళ్లీ మొదలెట్టి పనిచేస్తే చాలా ఆలస్యమవుతుంది. అందుకని పైకెక్కి ఒక చేత్తో జాగ్రత్తగా దూలానికి ఆన్చిన నిచ్చెన పట్టుకుని రెండోచేత్తో పుల్లీమీదికి బెల్టు లాగి వేశాడు. ఎక్కిందిగాని మళ్లీ టపటపమంటూ జారిపోయింది. ఇంకెవరినయినా పిలుద్దామనుకున్నాడు గాని యీ మాత్రానికే ఎందుకులే అని వూరుకున్నాడు. మళ్లీ గట్టిగా లాగి బెల్టు పుల్లీమీద వేశాడు. బెల్టులింకు పూర్తిగా అరిగిపోయింది — చూసుకోలా. పెద్దపుల్లీ తిరిగే తీవ్రంమీద బెల్టు ఫెళ్లున తెగి సిమ్మాద్రికళ్లకు కొట్టింది. సిమ్మాద్రికళ్లు గిర్రున తిరిగిపోయాయి. పట్టుకున్న దూలం విడిచేసి రెండుచేతుల్తో కళ్లు గట్టిగా పట్టుకుని 'బాబోయ్' అని పెద్దకేకేసి నిచ్చెనమీదనుంచి కిందికి దొర్లిపోయాడు. దెబ్బతగలడం, కిందకి దొర్లిపోవడం కన్నుమూసి తెరిచే లోపల జరిగిపోయాయి. కిందికి దొర్లిపోవడంలో, అదృష్టవశాత్తు, ఏ యంత్రంమీదా పడలా. కళ్లవెంట నెత్తురు కాల్వలుకట్టి ప్రవహిస్తోంది. సిమ్మాద్రికి నోట మాట లేదు. అతనికి బాధే తెలియదు. శరీరం కొయ్యబారిపోయింది.

పనివాళ్లంతా పరుగెత్తుకొచ్చారు వర్కుషాపు కట్టేసి. సిమ్మాద్రిని ఆస్పత్రికి చేరవేశారు.

కళ్లు పరీక్షచేసి మళ్లీ వస్తాయో రావో చెప్పలేనన్నాడు డాక్టరు.

ఈ వార్త వూరంతా — అదెంత వూరుగనక! — ఇట్టే పాక్కిపోయింది.

ఈ వార్త తెలిసేటప్పటికి అప్పలమ్మ జడేసుకుని పువ్వు పెట్టుకుంటోంది; ఎప్పుడు చీకటిపడుతుందా, ఎప్పుడు తన బావ తనను తన బాహువుల్లోకి లాక్కుంటాడా అని వేదనపడిపోతోంది — ఈ వార్త చెవినిపడేటప్పటికి ఆమెమనసెంత క్షోభించిందో ఎవరు వర్ణింపగలరు? — ఆమె స్పృహలేకుండా నేల కొరిగిపోయింది.

ఆమె అత్తా, మామా ఆమెమాట తలపెట్టకుండా, గుండెలు బాదుకుంటూ సిమ్మాద్రికోసం బయలుదేరారు. కన్నకడుపుతీపి!

ఇరుగూ పొరుగూ అమ్మలక్కలు అప్పలమ్మ చుట్టూ చేరి ముఖాన చన్నీళ్లు కొట్టి సేదదీర్చి ఓదార్పు మాటలు చెప్పనారంభించారు. హృదయంలో రేగిన ఆ ఘోరదవాగ్నిని ఎన్ని సముద్రాలలోని నీరు చల్లార్చగలదు? —

* * *

కాలం గడిచింది.

కాలానికి ఒకరంటే దయా? అభిమానమా? తను నడిచిపోతుంది. ఎవరయినా బాధపడుతున్నారంటే ఏమయినా ఒక క్షణం నిలబడి ఓదారుస్తుందా? అయినా అసలు తనే నిలబడితే బాధపడేవారి బాధ మరీ ఎక్కువవుతుందేమో? అవును! తనే నిలబడితే బాధపడేవాళ్ల జీవితం ఏంకాను? వాళ్ల బాధ కిక అంతమెక్కడుంటుంది?

కొన్ని నెలలు గడిచాయి.

సిమ్మాద్రికళ్లు పూర్తిగా పోయాయి.

అతడికిక ఈ ప్రపంచంలో కావలసిందింకేముంది? ఇక ప్రపంచంలో తనకు కనిపించే దేమిటి? అమ్మ, నాన్న, తన అప్పలమ్మ, తన గుడిసె, ఇరుగూపొరుగూ, తన స్నేహితులు, ప్రపంచానికంత

కూ వెలుగునిచ్చే సూర్యుడు, పచ్చికబయళ్లు, తనను ఎప్పుడూ ఆకర్షించే ఎత్తయిన కొండలు, చక్కటి లోయలు, మంచిపసువులు, వెన్నెలరాత్రులలో ఆకాశాన మబ్బులచాటున దోబూచులాడే చంద్రుడు, —ఒకటేమిటి, ఇక తనకు ఈ ప్రపంచంలో ఏవీ కనిపించవన్నమాట! ఇంకా తనకు పాతికేళ్లు దాటలేదే, ఇంకా ఎన్నిసంవత్సరాలు, ఎన్నియుగాలు తను ఇలా జీవించివుండాలి? ఈ ప్రపంచంతో తన కిక సంబంధమేమిటి? తన నెవరు ప్రేమిస్తారు?—అమ్మా, నాన్నా! అవును, నిజమే, అమ్మ, నాన్నా ప్రేమిస్తారు, కడుపున పుట్టబట్టి. కాని అమ్మనాన్నా ప్రేమతో తృప్తిపడే వయస్సు దాటిపోయిందే!—అప్పలమ్మ తనను ప్రేమించదూ?—చిన్నప్పట్నించీ కలిసితిరగలా?—అప్పలమ్మకు తనమీద దయ కలగదూ!—ఏమో—గుడ్డిమొగుడు తన కెందుకనుకుంటుందేమో? అబ్బ! తన కెందు కీ వెధవజీవితం?—తను బాధపడడం, ఇతరులను బాధపెట్టడం? తను బ్రతికివుంటే తన కేమిసుఖం, ఇతరుల కేమిసుఖం? తల్లీతండ్రినీ ఇక తను సుఖపెట్టలేడుగదా?— చచ్చిపోతే?— అబ్బ, ప్రాణం ఎంతతీపి!—గుడ్డివాడిదిమాత్రం ప్రాణం కాదూ? గుడ్డివాడికి మాత్రం కోర్కె లుండవూ? చూడకపోతే మానె, తానేమయినా సుఖా లనుభవించ లేడూ?—

తనకు కళ్లెందుకు పోయినా యసలు? ఆనాడు తను పనిలోకి పోకపోతే? పోకుండా ఎలా వుంటాడు? ఎవరికి తెలుసు కళ్లు పోతాయనీ, తన కిక ప్రపంచమే శూన్యమయిపోతుందనీ?

తనకు కళ్లు పోయినాయి? ఎందుకు పోయినాయి?—తన కర్మ! నిజమే, కర్మే!—తన సావుకారు మంచివాడే! అయితే తన పోయిన కళ్లు తెచ్చి పెట్టగలడా? రెండువందల రూపాయలిచ్చాడు. తన కళ్ల విలువ రెండువందల రూపాయలా? — ఒక్కొక్క కన్నుకు ఒక్కొక్క వందా? భగవంతు డిచ్చిన కళ్లకు మనిషి ఎలాంటి విలువ కట్టాడు!—ఏదీ రెండువంద లిస్తాను, నీ రెండుకళ్లు నాకిచ్చెయ్—

రెండువందలిచ్చిన ఆ పెద్దమని షేమనుకుంన్నాడు? "పాపం, మంచిదెబ్బ తిన్నాడు. ఏం చేస్తాం? మిల్లుల్లో ఇది మామూలే. ఎవరి కర్మ వారిది —రెండువంద లిచ్చానుగా?" ఇష్టం వున్నా లేకపోయినా ఆసామ్మ ప్రభుత్వమే యిప్పిస్తుంది—కాని అది తనే స్వయంగా దయార్ద్రహృదయుడై యిచ్చాడే! పైగా రెండుమూడునెలల గ్రాసం ఇంటికి పంపించాడు! అతనికి అయిన మందుఖర్చంతా ఇచ్చాడు! నిజమే, అంతకంటే తను చేయగలిగిం దేముంది?

వర్కుషాపులో అందరూ ఆ రెండువందలతో సిమ్మాద్రిమాట మరచిపోయారు. సిమ్మాద్రి పనిచేసే యంత్రందగ్గిరికి యింకొకడు వచ్చాడు. వర్కుషాపు యథాప్రకారం నడచిపోతూనేవుంది.

* * *

సిమ్మాద్రి ఇల్లు కదలడంలా. అప్పలమ్మ అడ్డమయిన చాకిరీ చేస్తోంది. అప్పలమ్మమాట తలచుకుంటే సిమ్మాద్రిగుండెలు నీరయిపోతాయి. తనవంటి దౌర్భాగ్యుడా ఆమెకు మొగుడు? ఎంత చక్కగా కన్పించేది తన కళ్లకు!

అప్పలమ్మకి మొదట్లో తన మొగుడుకళ్లవంక చూస్తే భయమేసేది—రానురాను భయంతగ్గింది. అతన్ని చూస్తే జాలేసేది. కాని, అతనిమీద వాంఛ మాత్రం కలిగేదికాదు. అత నెప్పుడన్నా సరాగాలాడితే ఏవగించుకునేదికూడాను. మనిషి శుభ్రంగా వుండమంటే వుండేవాడు కాదు. సరిగ్గా ఒంటిమీద గుడ్డయినా వుంచుకునేవాడు కాదు. గడ్డం మాసిపోయి ఎప్పుడూ బికారిలా వుండేవాడు. త నెలా వున్నాడో తనకు కనిపిస్తేగా శుభ్రంగా వుండడానికి ప్రయత్నం చేసేందుకు!

ఇలా కొన్ని నెలలు గడిచింది. యుద్ధ మొచ్చింది. దానివెంట కొన్నాళ్లకి కరువు. ఇంట్లో ముసలాడి తాగుడు, బయట కరువు దుంపతెంచేస్తున్నాయ్.

ఒకడు తెచ్చిన డబ్బుతో కరువుకాలంలో నలుగు రెలాగ తినగలరు? కొన్నాళ్లు పస్తుపడుతున్నారు — ఇప్పుడు సిమ్మాద్రితల్లి అప్పలమ్మను దూషించడం మొదలుపెట్టింది. "నిన్ను ఇంట్లోకి తీసుకొచ్చింది మొదలూ దరిద్రమే. పుట్టి తల్లినీ, తండ్రినీ పొట్టబెట్టుకున్నావు. నిన్ను నాకొడుక్కి కట్టుకుని

నాకొడుకుకళ్లు మంటబెట్టుకున్నాను." అని వెక్కి వెక్కి ఏడ్చేది.

నిజంగా తనమూలానే కళ్లు పోయాయా? తనేం కళ్లు పీకేసిందా?—అప్పలమ్మకు చిన్నతనపు వుక్రోషం వచ్చేది. దుఃఖమూ వచ్చేది. వీళ్ల ఇంట్లో పడబట్టిగదా తన కీకర్మ!

రానురాను సిమ్మాద్రినికూడా తలిదండ్రులు దూషించడం మొదలుపెట్టారు. కరువుకాలంలో ఎవరు కూర్చోబెట్టి తిండిపెడతారు, పోయి అడుక్కుతినండనేవారు. రోజురోజుకీ సతాయింపు జాస్తీఅయింది. అప్పలమ్మను కొట్టడంకూడా మొదలెట్టారు. సిమ్మాద్రికీ, అప్పలమ్మకీ ఆఇల్లు నరకకూపం అయింది. ఆబాధ వాళ్లు భరించలేకపోయారు—సిమ్మాద్రి, అప్పలమ్మ కూడ బలుక్కున్నారు. నిజమే, వాళ్లన్న మాటలో తప్పేముంది? కరువుకాలంలో ఒకరొకర్ని ఎలా పోషించగలరు? వాళ్లచేత రోజూ తిట్లు తింటూ ఇంట్లో మాడిచచ్చేకంటే ఇల్లు విడిచి ఎక్కడికయినా పోయి అడుక్కుతింటే మేలుకాదూ?

ఒకరోజు రాత్రి ముసిలోళ్లిద్దరూ నిద్రపోగా చూచి సిమ్మాద్రీ, అప్పలమ్మా ఇల్లుదాటేశారు.

ఏవో వెర్రిపదాలు పాడుకుంటూ రైళ్లలో బిచ్చమెత్తుకోవడం ఆరంభించారు. మిలిటరీవాళ్లు వేళాకోళా లాడి నాలుగుడబ్బులు పారేసేవారు—దానితో కడుపు నింపుకునేవారు.

గుడ్డాడి పెళ్లాన్ని చూస్తే నలుగురికీ అనువుగా వుండేది. వయసులో వున్న యువతి. చక్కటి అవయవాలు, తీరయిన నడక—చూడ ముచ్చటగా వుండేది. రైళ్లలో తిరుగుతూవుంటే మిలిటరీవాళ్లు మీద పడిపోయేవాళ్లు. కొత్తలో కొన్నాళ్లు అసహ్యించుకున్నా అప్పలమ్మకి రాను రాను వాళ్లు వేళాకోళాలాడుతూ వుంటే సరదాగా వుండేది. రకరకాల మనుష్యులు—చక్కటి గుడ్డ లేసుకుని దర్జాగా వుండేవాళ్లు. రోజురోజుకీ తన పక్కని పెద్ద జీబులా మొగుణ్ని చూస్తే అప్పలమ్మకి అసహ్యమేసేది.

ఒకరోజు ఒక మిలిటరీవాళ్ల పెట్టెలో ఎక్కారు—అంతా తెల్లవాళ్లు. గుడ్డాడిని చూచి ముందు తోసెయ్యబోయారుకాని వెనకాల అప్పలమ్మను చూచి రానిచ్చారు. అప్పలమ్మకి అప్పటికి మిలిటరీవాళ్లతో ఎలా సంచరించాలో చేతయింది. ఏవో వెర్రిపదాలు కాసేపు పాడారు. బండి కదిలింది. వీళ్లు బండిలో ఎక్కినప్పట్నుంచీ మిలిటరీవాళ్లకి కోతికి కొబ్బరికాయ దొరికినట్లుంది. బండి కదలగానే ఒకడు కొంగుచ్చుకు లాగాడు అప్పలమ్మని—విదిలించుకుంది. ఇంకొకడు చెయ్యిలాగాడు—ఒళ్లు పులకరించింది. ఒకడు నారింజగింజ మీద తుపుక్కున వుమ్మేశాడు — దులిపేసుకుంది. ఒకడు కన్నుగీటాడు—నవ్వాపుకుంది. ఇన్ని చేసినా నోట కేకయినా వెయ్యలా. మొగుణ్ని ఓమూల కూచోబెట్టి కొంచెం దూరంగా నుంచుంది. ఏం జరిగేదీ మొగుడికి తెలియకూడదని. కాని సిమ్మాద్రికిమాత్రం ఏదో అల్లరి జరుగుతోందని అనుమానంగానే వుంది. "ఏందే అప్పలమ్మా, ఏందే?" అని అడిగాడు. "ఏంలేదు. ఆళ్లల్లో ఆళ్లు దెబ్బలాడుకుంటున్నారు." అంది అప్పలమ్మ.

సిమ్మాద్రికి ఏమిటో ఒంటిమీద తేళ్లూ జెర్రులూ ప్రాకుతున్నట్లనిపించింది. పక్కని తడిమాడు—అప్పలమ్మ వుందేమోనని. అప్పలమ్మ కనపడలా. "అప్పలమ్మా" అని కేకేశాడు.

జవాబు లేదు. మిలిటరీవాళ్లు పకపకా నవ్వడం మాత్రం వినిపించింది.

మళ్లీ కేకేశాడు—"అప్పలమ్మా" అని.

"ఎందుకల్లా గొడ్డులా అరుస్తావ్? వొడ్లో కళ్లా"నంది అప్పలమ్మ. కామోసు ననుకున్నాడు.

ఆపెట్టెలోంచి పక్కస్టేషన్లో దిగిపోయారు. అది పెద్ద రేవుపట్టణం. ఎక్కడ చూచినా మిలిటరీ లారీలు, మిలిటరీవాళ్లు—పట్టణం బాగా సందడిగా వుంది.

రైలు దిగిందేగాని అప్పలమ్మ శరీరంలో రక్తం వుడికిపోతూనేవుంది. ఏమిటో వెర్రెత్తినట్లుంది.

చీకటిపడుతోంది. ఒక సందంట నడిచిపోతున్నారు. అంతదూరాన ఓ మిలిటరీవాడు—ఓదొర చేత్తో పిలుస్తున్నాడు. ఎవరినో అని వెనక్కు-

చూచింది. తనవెనక ఎవరూ లేరు. మొగుడు మాత్రమే వున్నాడు. మొగుడు పుచ్చుకున్న కర్ర ఒక వైపు తను పుచ్చుకుని నడిపించుకొస్తూవుంది.

అదేపనిగా పిలుస్తూవున్నాడు దొర. జేబులో నోట్లు తీసి చూపిస్తున్నాడు. వెనక మొగుణ్ణి చూచింది —అవతల దొర పిలుస్తున్నాడు—కోర్కెలు పరుగులు తీస్తున్నాయి.

మొగుణ్ణి రోడ్డుపక్కన కూచోబెట్టి "ఉండు, వస్తున్నా"నంది.

గుడ్డాడిని కూచోపెట్టడం చూచాడు దొర. అప్పలమ్మ పదిఅడుగులయినా వెయ్యలేదు. దొర పరిగెత్తుకొచ్చి అప్పలమ్మని అమాంతం చేతుల్లోకి ఎత్తేసుకున్నాడు.

సీమాద్రి ఆ రాత్రంతా 'అప్పలమ్మా' అని అరుస్తూ ఆ రోడ్డుపక్కనే కూర్చున్నాడు. "నా అప్పలమ్మ ఎక్కడయినా కన్పించిందా ?—నా అప్పలమ్మ" అని ఏడ్చాడు; పెడబొబ్బ లెట్టాడు. ఇంత పట్టణంలో ఎవరో అప్పలమ్మ ?

తెల్లవారింది. డొక్కలు మాడుతున్నాయి. దోవేపోయేవాళ్లు గుడ్డాడిని చూచి జాలేసి కానీ, పరకా పారేశారు. అవి ఏరుకున్నాడు. ఇన్నాళ్లూ తనను అప్పలమ్మ నడిపించుకెళ్లేది, ఎక్కడి కెళ్లాలన్నా. ఇప్పుడిక తన కెవరు దోవచూపిస్తారూ ?—

*  *  *

అప్పలమ్మకి ఇట్టే తెల్లవారిపోయింది. ఇదో ప్రపంచం! సముద్రపొడ్డున ఇసక ఎంత మెత్తగా వుంది!

మళ్లీ మొగుడిదగ్గర కెళ్లాలంటే మనసొప్పలా అప్పలమ్మకి. దొర చేతినిండా డబ్బిచ్చాడు. సముద్ర పొడ్డునే ఒకగది అద్దెకు తీసుకుంది. మిలిటరీ వున్న పట్టణమేమో—కాలక్షేపానికి కొదవలేదు. మంచిమంచి చీరలు కట్టుకున్నప్పుడల్లా అనుకునేది తను ఇంత అదృష్టం చేసుకుంటే గుడ్డాడితో కాపురంచేయడం ఎలా జరుగుతుందని. అప్పలమ్మకి యిప్పుడొక దాసీది కూడా.

ఇలా ఒకటి, రెండు సంవత్సరాలు గడిచాయి.

సీమాద్రికి ఇప్పుడొక బిచ్చగాడు స్నేహితుడు. ఆ బిచ్చగాడు రాయిలా వుండడం మూలాన వాడి కెవడూ కానీ ఇచ్చేవాడు కాడు. ఏ అమ్మా పట్టెడు మాదాకబళం పడేసేదికాదు. గుడ్డాడి పేరు చెప్పుకు బ్రతకొచ్చని సీమాద్రితో చేరాడు. అలాగే వాళ్లు కాలం గడిపేవారు. సీమాద్రి ఇప్పుడు అప్పలమ్మమాట తలవడమే మానేశాడు. ఏ మిలిటరీలారీకింద పడి చచ్చిపోయిందో అనుకునేవాడు.

*  *  *  *

ఇప్పుడు అప్పలమ్మకు అప్పుడప్పుడు జ్వరం తగులుతోంది. ఒళ్లంతా మంటలు. ఏమిటో తీవ్రమయిన బాధ పట్టుకుంది. కొన్నాళ్లు ఏమీ లేదనుకుని బాధ మరచిపోవాలని చూచింది. కాని వశమా ? బాధ నానాటికీ ఎక్కువయిపోయింది. పెద్ద ఆస్పత్రికి వెళ్లింది. అక్కడంతా హాస్యాలాడారు—ఏవో ఇంజక్షన్లు పుచ్చుకోమన్నారు. పుచ్చుకుంది. కాని ఏమీ తగ్గలా.

ఒళ్లంతా బొబ్బలెక్కిన ట్లవుతోంది. తిండి సహించడంలా. ముఖం రానురాను వికారంగా తయారవుతోంది. అద్దంలో ముఖం చూచుకుంటే తనకే భయమేసేది. జుట్టూడిపోవడం మొదలుపెట్టింది. ఎంతలో ఎంత మార్పు! ఎంత ఘోరమయిన మార్పు! విటులు తగ్గిపోయారు—తగ్గిపోవడమేమిటి, అసలు రావడమే మానేశారు. దాసీని మానేసింది. దాసీదానికి విటులు రాని కొంపలో లాభమేమిటి ? ఎంత జీతమిస్తే యేం, పయిన విటులిచ్చిన బక్షీస్‌మాటో ?

అప్పలమ్మకి శరీరంలో బాధకు తోడు తన కష్టం, సుఖం చెప్పుకుందామంటే ఎవళ్లూ వినేవాళ్లు లేకపోయారు.

"అమ్మా, గుడ్డాణ్ణి తల్లీ, మాదాకబళం"అని వీధిలో మాదాకవళంఅబ్బి కేకేశాడు.

"గుడ్డాడుబాబూ, గుడ్డాడు. ఇంత కూడెయ్యండి తల్లీ"అని కేకలేస్తున్నాడు గుడ్డాణ్ణినడిపిస్తూ యింకొకడు, వీధిదీపంవెల్తుర్ని గిన్నెలో అన్నం చూచుకుంటూ.

బాధతో మంచంమీద లేచికూర్చుని పక్కకిటికీలోనుంచి బయటికి చూచింది అప్పలమ్మ.

రోజూ ఆవేళకు ఆకేక తనకు వినబడుతూనే వుంది. ఆ రెండు గొంతుకల్లో ఒక గొంతు తనకు పరిచయమయినదే. తెలిసీవుండీకూడా రోజూ ఆకేక వినిపించినప్పుడు కిటికీతలుపు వేసేసుకునేది. కాని ఈరోజు తలుపువేయ బుద్ధికాలా. ఓసారి సిమ్మాద్రి ఎలా వున్నాడో చూడాలనిపించింది.

బిచ్చగాళ్లు అలా కేకలేసుకుంటూ వీధి దాటిపోయారు. అకస్మాత్తుగా విపరీతమయిన బాధ బయలుదేరింది అప్పలమ్మ శరీరంలో. చెప్పడానికి వీలులేని బాధ. శరీరమంతా కాలిపోతోంది. కళ్లు మండిపోతున్నాయి. దాహమవుతోంది. ఎవరు మంచినీళ్లిస్తారు? పక్కలోనుంచి లేవలేదు. అలా దాహంతోనే పక్కలో ఒరిగిపోయింది. నిద్రపట్టేసింది.

* * * *

అప్పలమ్మకి రోజురోజుకీ బాధ తీవ్రమయిపోతోంది. భరించడానికి శక్యంకాకుండావుంది. ఒకపూట కొంచెం తగ్గినట్లు కన్పించినా మళ్లీ వెంటనే వెయ్యిరెట్లు ఎక్కువయిపోతోంది బాధ. తనరూపం అతివికారంగా తయారయింది. ఏ ఆస్పత్రికి వెడదామన్నా బయటికి రావాలంటేనే అసహ్యమేసేది. అసలు లేవగలిగితేనా? ఎన్నాళ్లిలా బాధపడడం? ఒళ్లంతా పుళ్లుపడిపోయింది. ఈగలు జుమ్మని ముసురుతూవుండేవి. ఈగల్ని తోలుకునేందుకుకూడా శక్తి చచ్చిపోయింది. ఈగలు ఆపుళ్లమీద కూర్చుని శరీరంలోకి రంధ్రాలు పెట్టి పీక్కుతినేవి—బాధ సహింపరానిదయిపోయింది.

ఆరోజు ప్రొద్దుగూకింది.

ఇంకా వీధుల్లో సందడిగానే వుంది. జనం తిరుగుతూనే వున్నారు. సముద్రపు హోరు నిముషనిముషానికీ చీకటిహెచ్చినకొద్దీ ఎక్కువవుతోంది.

అప్పలమ్మశరీరంలో బాధకూడా హెచ్చిపోతోంది. అప్పలమ్మకు తాపం ఎక్కువయింది. అప్పలమ్మకి సముద్రం "రారమ్మ" ని పిలుస్తున్నట్లు వినిపించింది. తనకు తెలియకుండానే, వస్తున్నానని లేచింది మంచంమీదనుంచి.

అంతవరకూ నడవలేని అప్పలమ్మ తనను ఈ ప్రపంచంలో అంత గారవించి ప్రేమతో రా రమ్మని పిలిచేందుకు ఒక సముద్రమన్నా వున్నదని తెలుసుకోగానే నాలుగడుగులు వేయగలిగింది. నడవలేక నడవలేక వీథిగుమ్మంలోకి వచ్చింది.

సందుమలుపులో ఒక పది అడుగుల అవతల "గుడ్డాడు తల్లీ, గుడ్డాడు, మాదాకబళం" అని కేక విన్పించింది.

అప్పలమ్మమనస్సంతవరకూ ఎందులోనో లగ్నమయిపోయింది. ఆ కేక వినిపించగానే మళ్లీ ఈ ప్రపంచంలో పడ్డది. సిమ్మాద్రీ, అతన్ని నడిపించుకుంటూ ఓబిచ్చగాడూ ఇళ్లవెంట బిచ్చమెత్తుకుంటూ వస్తున్నట్లుగా దీపాలవెల్తుర్ని కనిపించింది. మనస్సులో ఒకక్షణం లోపలికెళ్లిపోదామా అనిపించింది. వెనక్కు తిరిగితే ఇల్లు మహానరకకూపంలా కన్పించింది. లోపల ఘోరరాక్షసు లున్నట్లుగా కన్పించింది. సన్నదీపపు వెలుగులో కీనీడలన్నీ పెద్దపెద్ద దెయ్యాలులా కన్పించాయి. లోపలికి వెళ్లలేకపోయింది.

సముద్రంలో మళ్లీ ఓ పెద్దకెరటం భోరుమని కేకలేసింది. "రావేం? ఇంకెందుకమ్మా ఆలస్యం? నా చల్లటి బాహువుల్లోకి నిన్ను తీసుకుని నీబాధలన్నీ తీరుస్తా రావమ్మా" అని. ఆ కేక ఎంత ప్రేమపూరితంగా వుంది!

గబగబా సముద్రంవైపు నడిచింది అప్పలమ్మ. గుమ్మం దాటి వీథిలో పడిందో లేదో "క్రీ్"మని మిలిటరీలారీ బ్రేక్ వేసింది—కాని లాభంలేకపోయింది.

గొల్లుమని జనం మూగారు. గుడ్డాడు "ఏమి?" టన్నాడు. అతన్ని అవతలికి తోసేసి అంతా శవంచుట్టూ మూగారు. పెద్ద రక్తపుమడు గయింది. సరిగ్గా నెత్తిమీదనుంచి పోయింది చక్రం. "ఏమి లేమి"టని గుడ్డాడు తహతహలాడుతూ అడిగాడు. "గుడ్డాడివి, రోడ్డుపక్కనుంచి పోవోయ్. లేకపోతే నువ్వూ అలాగే చస్తా"వన్నా రెవరో.

"ఎవరో బోగంది మిలిటరీలారీక్రింద పడి చచ్చిపోయింది" అన్నాడు గుడ్డాడి స్నేహితుడు దగ్గిరకొచ్చి గుడ్డాడి చేతిలో కర్ర రెండోవైపు తను పట్టుకుంటూ.

"పాపం" అన్నాడు గుడ్డాడు. తన అప్పలమ్మ ఏమయిందో? ఎంతమంది నడిగాడు? ఒకళ్లయినా చెప్పారూ? ఎవరికి తెలుసు? తన అప్పలమ్మ ఏమైతే ఎవరికి కావాలి?